విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

కొనకనమిట్ల మండల ఎస్ఐగా బ్రహ్మానాయుడు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి బ్రహ్మా నాయుడు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు సీసీఎస్ నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన కే దీపిక లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడ్డారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో సిబ్బంది సహకారంతో లాండ్ ఆర్డర్‌ను పక్కాగా అమలు చేస్తామన్నారు.

గోల్డ్ షాప్‌లు మూసివేత

విశాలాంధ్ర-దర్శి : దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో గల బంగారం వ్యాపారి పోతంశెట్టి వరప్రసాద్ ఆదివారం మృతి చెందాడు. దర్శి గోల్డ్ మార్చెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వరప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గోల్డ్ షాప్‌లు అన్ని మూసివేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవతి మహానంద, దేవత రామారావు, తాళ్ళంరాధకృష్ణ, కృష్ణమాచారి, తెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విజ్ఞప్తుల దినానికి 18 అర్జీలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తిల దినానికి 18 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో తోట అజయ్‌కుమార్ తెలిపారు. కని గిరి మండలం నుంచి 4 వినతులు, సీఎస్‌పురం 3, పామూరు రెండు, హనుమంతుని పాడు 2, వెలిగండ్ల మూడు, కొనకలమెట్ల 2, దర్శి 1 దొనకొండ 1 వినతులు వచ్చాయి. వీటిని సత్వరమే పరిష్కరిస్తామని ఆర్డిఓ అజయ్ కుమార్ అర్జీదారులకు హామీ ఇచ్చారు.

నారాయణస్వామిని దర్శించుకున్న దారపనేని

విశాలాంధ్ర-పామూరు : ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధి చెందిన శ్రీ శ్రీ శ్రీ మిట్టపాలెం నారాయణ స్వామి దేవ స్థానమును కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఆది వారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దారపనేని చంద్రశేఖర్‌కు స్వామివారి పట్టు వస్త్రం బహుకరించి తీర్థప్రసాదాలను దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ అంద ˘జేశారు. మిలియన్ సుబ్బరాయుడు (ఎమ్మెస్సార్ చౌదరి) పంగా సిద్ధార్థ్, కొమ్మినేని వెంకట్రావు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పీసీపల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 10.30 గంటల నుండి సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు మండల అధికా రులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని తెలియజేశారు. మండల స్థాయి అధికారులు కచ్చితంగా రావాలని కింది స్థాయి అధికారులను సమావేశానికి అనుమతించబోమని హెచ్చరించారు.

బ్యాటరీ షాప్‌ను ప్రారంభించిన పోతుల రామారావు

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగు టూరులోని సోమవారం నాడు కందుకూరు మాజీ శాసన సభ్యులు పోతుల రామారావు రవి రైస్, బ్యాటరీ షాపును నూతనంగా ఏర్పాటుచేసిన షాపును కందుకూరు మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ షాపు వినియోగించుకుని అవసరమైన రైసు, వాహనాలు కావాల్సిన బ్యాటరీలు, ఇన్వర్టర్లు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల రామారావు అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంబద్ధమైన సర్దుబాటుని ఖండిస్తున్నాము యూటీఫ్

విశాలాంధ్ర-దర్శి : ఇటీవల జరిగిన బదిలీలు అతితక్కువ సమయంలో పూర్తిచేసి శభాష్ అనిపించుకున్న ప్రభుత్వం, ఉపాధ్యాయులు వారి వారి స్థానాల్లో చేరి పాఠశాలలను చక్కబెట్టుకుంటున్న తరుణంలో సర్దుబాటు పక్రియను తీసుకు వచ్చి ఉపాధ్యాయులను అందోళనకు గురిచేస్తుందని, ప్రభుత్వానికి ఏమాత్రం మంచిది కాదు విద్యార్థుల నమోదుకు ప్రతిసంవత్సరం ఆగస్టు 31 వరకు చేరుటకు అవకాశం కల్పించి విద్యార్థుల నమోదుకు అవకాశం కల్పించేది. ఒక ప్రక్క జెవికే పూర్తిచేయిస్తూ మరో పక్క డ్రాపౌట్‌లను చేర్చుకోమని ఉపాధ్యాయులను పురమాయిస్తూ ఒక్కసారిగా నమోదు ప్రక్రియ వెబ్‌సైట్‌నుని నిలుపుదల చేసి సర్దుబాటు ప్రక్రియను జులై 31 వరకు ఉన్న విద్యార్థుల రోల్ ప్రకారం సర్దుబాటు చేయడం విద్యావ్యస్థపై ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధిని తెలియజేస్తుందాని యూటీఎఫ్ ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మీనిగ శ్రీను, ప్రధానకార్యదర్శి పి ఖాసిం జిల్లా కార్యదర్శి డి.వెంకటరెడ్డి, కార్యదర్శులు జె రవికుమార్, కె విజయభాస్కర్‌ఎస్. కె అల్లాబకష్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీకాలనీలకు నిలిచిన సాగర్ నీటి సరఫరా

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఎస్సీ కాలనీలకు వారం రోజుల నుండి సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో తాగునీటికి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి కాలనీలకు నీటి సరఫరా చేసే పైపులైను సమీపంలో ప్రోక్లైన్ ద్వారా చిలచెట్లను తొలగిస్తుండగా పైపులైను ఊడిపోవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. మినరల్ వాటర్ కొనుగోలు చేసి తాగాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పైప్ లైన్‌కు మరమ్మత్తులు చేపట్టి సాగర్ నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

సహకార బ్యాంక్ మొబైల్ ఏటిఎం సేవలు ప్రారంభం

విశాలాంధ్ర-కనిగిరి : సహకార బ్యాంక్ మొబైల్ ఏటీఎం సేవలను సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైయం ప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సహకార బ్యాంకు ఖాతా దారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు పంట సాగుకు అవసరమైన రుణాలు తక్కువ వడ్డీకే అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు సూరసాని మోహన్‌రెడ్డి, ఏపీ ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవకి వెంకటేశ్వర్లు, అయితా సుబ్బయ్య ఇతర నాయకులు అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలి

సీపీఐ బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండంటూ ఈ నెల 17వ తేదీన విశాఖపట్నం నుంచి బయలుదేరిన సీపీఐ బస్సు యాత్ర ఈ నెల 28న ప్రకాశం జిల్లాకు ప్రవేశించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండంటూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు రాష్ట్రంలోను, కేంద్రంలో జరుగుతున్న పరిణామాలు సమస్యలపై ఎక్కడికక్కడ సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 28,29 తేదీల్లో ప్రకాశం జిల్లాలో రెండు రోజులు బస్సు జాత రిగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 28వ తేదీన అద్దం కిలో రోడ్‌షో ముగించుకొని ఒంగోలుకు బస్సు జాతా రాను న్నట్లు తెలిపారు. రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఈ సమావేశానికి రైతు నాయకులు పి రామచంద్రయ్య, ఎం కోదండరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వడ్డె శోభానాద్రీశ్వరరావు, చుండూరి రంగా రావులు పాల్గొంటారన్నారు. 29వ తేది మార్కాపురం నుంచి కనిగిరికి బస్సు జాతా ప్రవేశించి అక్కడ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించుకొని సాయంత్రానికి నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకటరావు, పీవీఆర్ చౌదరితో పాటు కె వీరారెడ్డి, వి హనుమారెడ్డి, ఆర్ రామకృష్ణ, నల్లూరి మురళి, జి రవి, వెంకటేశ్వర్లు, సుభాన్ నాయుడు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని మధులికకు రూ.15 వేలు హైదరాబాదులో ఉంటున్న చక్కా రామాంజనేయులు ఆర్థిక సహాయం అందజేశారు. గతంలో వాసవి క్లబ్ ఆధ్వర్య ంలో 500 నోట్ పుస్తకాలను, ఇంజనీరింగ్ విద్యార్థిని పరీక్ష ఫీజును చెల్లించారని వాసవి క్లబ్ రీజనల్ చైర్మన్ మాగులూరి శ్రీకాంత్ తెలిపారు. పేద విద్యార్థిని విద్యార్థులకు తోడ్పాటు అందిస్తున్న దాత చక్కా రామాం జనేయులుకు వాసవి క్లబ్ తరఫున కృతజ్ఞతలు తెలుపు తున్నట్లు ఆయన తెలిపారు. వాసవి క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ కందగట్ల వెంకటరమణ, యూత్ క్లబ్ ప్రెసిడెంట్ సూరే నాగేశ్వర రావు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ ఆరవీటి చంద్రశేఖర్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ శేగు పద్మావతి, సెక్రటరీ కటకం లక్ష్మి ప్రియ, ట్రెజరర్ కటకం తేజస్వి,శేగు స్వాతిక తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం సబ్ డివిజన్‌ను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- సీపీఎం ధర్నా

విశాలాంధ్ర-మార్కాపురం : తీవ్రమైన కరువు ఛాయలు నెలకొన్న నేపథ్యంలో, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మార్కాపురం రెవిన్యూ డివిజన్‌ను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం సబ్ కలెక్టర్ సేతు మాధవ్‌కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ తీవ్రమైన కరువు ఛాయలు నెలకొన్నాయని, సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదని, బోరు బావులపై ఆధారపడి వేసిన కంది, పత్తి మిరప పంటలు తీవ్రంగా ఎండి పోయాయని, రైతులు కోట్లాది రూపాయల పెట్టుబడులు నష్టం వాటిల్లందని, వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం పనులు కూడా నిలిపివేయడం జరిగిందని, ఫలితంగా వ్యవసాయ కూలీలకు ఉపాధి లేకుండా పోయిందని, రైతుల పెట్టుబడులు హారతి కర్పూరం లాగా మట్టిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున వెంటనే మార్కాపురం డివిజన్ మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, సహాయక చర్యలు చేపట్టాలని, ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలని, సబ్సిడీతో కూడిన విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని, అన్ని గ్రామాల్లో తాగు నీటి ఎద్దడిని నివారించాలని, ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించి మరో వంద రోజులు ప్రత్యేక అలవెన్స్‌లతో కూలీలకు ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాల నాగయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం మండల కార్యదర్శి తురక ఏడుకొండలు, విద్యార్థి సంఘం నాయకులు కొమ్ము విజయకుమార్, పి లోకేష్, రైతు సంఘం మార్కాపురం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సీపీఎం నాయకులు పండిట్ రూబెన్, బలుసు కాశయ్య,జెక్కి వెంకటేశ్వర్లు, షేక్ నన్నేసా, ఎస్‌కే జబ్బార్, సంపతి శ్రీనివాసులు, వినుకొండ రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

26న జిల్లా పంచాయితీ సర్పంచుల సమావేశం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఈ నెల 26వ తేదీ శనివారం ప్రకాశం జిల్లా పంచాయితీ సర్పంచుల సంఘం విస్తృత స్థాయి సమావేశం ఉదయం 11 గంటలకు ఒంగోలులోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దగల మల్లయ్య లింగం భవన్‌లో జరుగుతుందని సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. వీర భద్రాచారి తెలిపారు. సోమవారం సంఘం కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ప్రభుత్వ అనవసర ఆంక్షలు, పి.ఎఫ్. ఎం.ఎస్.విధానం అమలులో జాప్యం,గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు చెల్లింపులు, గౌరవ వేతనం బకాయిలు,ఉపాధి హామీ పనులు, నిధులు కేటాయింపులు గురించి చర్చించడం జరుగు తుందని, బిల్లుల పెండింగ్, అధికారుల పనితీరుపై జిల్లా కలెక్టర్‌ను కలసి వివరించ నున్నట్లు వీర భద్రా చారి తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు,మండల కార్యవర్గం, సర్పంచులు హాజరు కావాలని వీరభద్రాచారి పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి.రాముయాదవ్, ఎం.శ్రీనివాస్, పి.అంజిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా బిల్లులకు సీఎం గ్రీన్ సిగ్నల్

- బిల్లులు చెల్లించాలని సీఎంను కలిసి కోరిన మంత్రి సురేష్
- వారం రోజుల్లో బిల్లులు చెల్లిస్తామని సీఎం హామీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యుఎస్) ఆధ్వర్యంలో గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుకు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారు. వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ట్యాంకర్ల బిల్లుల విషయమై కాంట్రాక్టర్లు పడుతున్న ఇబ్బందులను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం సీఎంను కలిసి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 236 కోట్ల 34లక్షల 47వేలు అవసరమని ఇంజనీర్ ఇన్ చీఫ్ కృష్ణారెడ్డి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ విషయాన్ని మంత్రి సురేష్ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన సీఎం బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తికానున్న నేపథ్యంలో జిల్లాలో కాంట్రాక్టర్లు, ముఖ్యంగా ఎర్రగొండపాలెం నియోజక వర్గంలోని కాంట్రాక్టర్లు అందరూ ఇంకా ఎవరైనా ఆన్లైన్లో బిల్లులను అప్లోడ్ చేయించకపోతే త్వరగా ప్రక్రియను పూర్తి చేయించాలని మంత్రి సురేష్ ఒక ప్రకటన ద్వారా సూచించారు.

ప్రముఖ బాటా షో రూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రముఖ బాటా షూ షో రూమ్‌ను సోమవారం గిద్దలూరు నియోజక వర్గ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, వైసీపీ రాష్ట్ర సెక్రటరి వెన్నా హనుమారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ పెనుగొండ కేశవరావు, యంపిపి పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, పట్టణ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కోశాధికారి రామదుగు రమేష్, వైసీపీ నాయకులు డాక్టర్ ఎస్‌కె మాక్బుల్ భాష, గుంటక చెన్నారెడ్డి, ప్రముఖ సామాజిక ఉద్యమ కారులు ఎస్ కె నజీర్ అహమ్మద్, ప్యాసింజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌కెజి నరసింహం, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పాలెం అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అతిథులకు షో రూమ్ అధినేత వాసవి గుప్త సాదరంగా స్వాగతం పలికారు.

అంతా మా ఇష్టం

- కంభం లో ఇరిగేషన్ ఆఫీస్ ఉందా???
- పిల్ల కాలువల కనుమరుగు
- చెత్త చెదారంతో నిండి పోయిన పంటకాలువలు
- ఇరిగేషన్ ఆఫీసర్ల చేతివాటమా లేక విధి నిర్వహణ లోపమా
- పంట పొలాలే రియల్ ఎస్టేట్ గా మారితే రాబోయే వారి పరిస్థితి ఏమిటి
- ఇరిగేషన్ కాలువలపై చప్టాలు కడుతున్న చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న ఇరిగేషన్ అధికారులు

చెత్తతో నిండిన కాలువ కంభం

మూసి వేసిన పంట కాలువ కంభం

విశాలాంధ్ర-కంభం : ఆసియా ఖండంలోనే అతిపెద్ద చెరువుగా ప్రఖ్యాతిగా పేరుగాంచిన కంభం చెరువు కింద ఎన్నో వేల ఎకరాల పంట పొలాలు సాగవుతున్నాయి. చెరువు నుంచి ఇరిగేషన్ కాలువలు మరియు పిల్ల కాలువల ద్వారా పంట పొలాలకు నీరుని అందించడం జరుగుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితిని గమనించి నట్లు అయితే దానికి పూర్తి విభిన్నంగా మారదాన్ని గమనించవచ్చు. చెరువు నుంచి వచ్చే నీరు రైతన్నలకు మరియు ఎవరికి ఉపయోగం లేకుండా తూముల లీకేజీ వలన వృధాగా వెళ్ళిపోతుంది. ప్రస్తుత పంట పొలాలకు నీళ్లు అందించే ఇరిగేషన్ కాలువలను చూసినట్లయితే ఇవి పంట కాలువల లేక మున్సిపాలిటీ కాలువల అని ఆలోచించ వలసిన పరిస్థితి ఏర్పడింది. పంటలకు నీరు నందించే కాలువలు వ్యర్థపదార్థాలతో, చెత్తతో నిండుగా దర్శనమిస్తున్నాయి. దుర్వాసన వెదజల్లుతున్న, క్రిమి కిటకాలు, విషసర్పాలు,తిరుగుతున్న, ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలైన చీమ కుట్టినట్లు కూడా లేదు. అధికారులకు ఇరిగేషన్ కాలువల పై తమకు ఇష్టం వచ్చినట్టు చప్టాలు, కట్టుకుంటూ వెళ్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి కారణం అధికారుల చేతివాటమా లేక విధి నిర్వహణ లోపమా. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా శోచనీయం. గతంలో ఉన్నటు వంటి ఎన్నో పిల్లకాలువలు కనుమరుగైపోయిన సంఘటన ఇప్పుడు మనం గమనిం చవచ్చు. ఇలాంటి ఎన్నో పిల్లకాలువలను తమ స్వార్థ పూరితమైన ఆలోచనలతో వాటిని రియల్ ఎస్టేట్ పేరుతో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై ఇరిగేషన్ అధికారులు మరియు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పంట పొలాలకు నీరుని అందించే పిల్ల కాలువలు లేకపోవడం వలన దేశానికి వెన్నెముకైన టువంటి రైతన్న ఎన్నో కష్టాల మధ్య తమ యొక్క పంట లను సాగు చేస్తున్నాడు. స్థానిక కంభంలో అసలు ఇరిగే షన్ ఆఫీస్ ఉందా లేదా అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

డ్రైనేజీ కాలువల పై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

కాలువలను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫూర్

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ కాలువలను ఆక్రమించి వాటిపై అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ హెచ్చరించారు. సోమవారం కనిగిరి పట్టణంలోని 15 వ వార్డులో సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఆర్ రోడ్డు, కోటా వారి వీధిలో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ అక్కడ డ్రైనేజీ కాలువల పై అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలను ఆక్రమించి వాటిపై అక్రమంగా కట్టడాలు చేపట్టడం వల్ల మురుగునీరు ప్రవహించే అవకాశం లేక ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోయి స్థానిక ప్రజలు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు పడవలసిన పరిస్థితి వస్తుందన్నారు. కాలువలు మూసుకుపోయే విధంగా నిర్మాణాలు చేపట్టవద్దని, అలా చేసిన వారికి ముందుగా నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, అప్పటికి కాలువలపై ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ఐతాసుబ్బయ్య ,సానిటరీ ఇన్స్పెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

సబ్జెక్ట్ టీచర్స్ లేక విద్యార్థుల అవస్థలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలంవారిపల్లి కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నందు మూడవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. హైస్కూల్ విద్యా ర్థులకు రెండు ఆంగ్ల ఉపాధ్యాయ పోస్టులు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక ఇంగ్లీష్ అధ్యాపక పోస్టు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు విద్యాపరంగా తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా కళాశాల స్థాపించినప్పటికీ విద్యా సంవత్సరం మొదలైన మూడు నెలలు గడుస్తున్నా ఆంగ్ల అధ్యాపకుడిని నియమించకపోవడం శోచనీయం. అదేవిధంగా హైస్కూల్ విద్యార్థులకు ఆంగ్లం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రెండు ఖాళీగా ఉండటంతో వారు విద్యాపరంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారి చొరవ తీసుకొని కళాశాల ఇంగ్లీషు అధ్యాప్పకుడిని, ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లము ఇద్దరిని, పిఎస్ మరియు గణితము పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్పందనలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : స్పందనలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో డయల్ యువర్ కలెక్టర్, స్పందన కార్యక్రమాలలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు. విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పిటిషన్లు రీఓపెన్ కాకుండా చూడాలని చెప్పారు. అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా సమస్యలను పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించ లేని పక్షంలో గల కారణాలను అర్జీదారులకు వివరిం చాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీ లను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికా రులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ ప్రజలు ఫోన్లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. త్రిపురాంతకం మండలం రామ సముద్రం గ్రామం నుంచి టి. పెద వెంకయ్య ఫోన్ చేశారు. తమ భూమిని ఆన్‌లైన్ చేయడం లేదని కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను పరిష్కరించాలని త్రిపురాంతకం మండల తహశీల్దారు ఆదేశించారు. మర్రిపూడి మండలం అయ్యపురాజుపాలెం గ్రామం నుంచి కె.మాధవ రావు ఫోన్ చేశారు. తమ గ్రామానికి త్రాగునీరు రావడం లేదని కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఈ విష యంపై కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికా రులను ఆదేశించారు. కురిచేడు మండలం పెద్ద వరం గ్రామం నుంచి జి. గురుస్వామి ఫోన్ చేశారు. సర్వే నెం. 168 లో ఉన్న తమ భూమిని వేరే వాళ్లు ఆక్ర మించి సాగుచేసుకుం టున్నారని, తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయవలసినదిగా కలెక్టరును కోరారు. కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని కురిచేడు మండల తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, డి.ఆర్.ఓ. ఆర్.శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, చెన్నయ్య, లోకేశ్వం౼రావు, నారదముని, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 99 ఫిర్యాదులు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక పోలీస్ 'స్పందన' కార్యక్రమాన్ని సోమవారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించి, వారి ఫిర్యాదుల పూర్వాపరాలను అడిగి తీసుకున్నారు. ఎస్పీ వారి యొక్క సమస్యలకు సానుకూలంగా స్పందించి వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రతి పిర్యాదుపై సంబందిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఎస్పీ మాట్లాడి చట్టపరిధిలో సత్వర చర్యలు తీసుకోవాలని, స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి ఫిర్యాదు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని త్వరితగతిన పరిష్కారించాలన్నారు.

సందిగ్ధంలో కనిగిరి ఏఎంసి పదవి?

కటికల వెంకటరత్నం

బజాజ్ బుజ్జి

షేక్ చాంద్ బాషా

కల్లూరి రామిరెడ్డి

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి ఏఎంసి చైర్మన్‌గా ఉన్న సరిత రెడ్డి పదవీకాలం ముగిసింది. ఆమె భర్తకు కూడా జిల్లా స్థాయి నామినేటెడ్ పదవి ఇటీవల దక్కింది. కనిగిరి ఏఎంసి చైర్మన్‌గా ఎవరు అనేది సందిగ్ధముగా మిగిలింది. నియోజక వర్గంలో ఎస్సీ నుంచి ఒకరు, బీసీ ఈ నుంచి ఇద్దరు, ఓసి నుండి ఒకరు ఏఎంసి చైర్మన్ కోసం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ నలుగురికి లెటర్స్ ఇచ్చారన్న ప్రసారం జోరుగా జరుగు తున్నప్పటికీ పామూరు పట్టణ వైసిపి అధ్య క్షులు షేక్ చాంద్ బాషా (సెంట్రింగ్ బుజ్జి)కి అభయహస్తం ఇచ్చినట్లు వినికిడి. అందుకు మండలాన్ని శాసించే వైసీపీ నేత కూడా అంగీ కారం తెలిపినట్లు తెలుస్తుంది. దీంతో పామూరు మండలంలో నిన్నటి, మొన్నటి వరకు ఒకటిగా ఉంటూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు, శు భకార్యాలకు, పరామర్శ లకు హాజరవుతున్న వైసీపీ మండల నాయకులు రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి తిరుగుతున్నారాన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్సీ సామాజిక వర్గము నుండి వెలిగండ్ల మండలం గుడిపాటి పల్లి సర్పంచి భర్త కటికల వెంకటరత్నం ఏఎంసీ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. సిఎస్‌పురం మండలం కోవిలం పాడు సర్పంచి బజాజ్ బుజ్జి ఏఎంసి పదవి కోసం తీవ్ర ప్రయ త్నాలు సాగిస్తున్నారు. గాడ్ ఫాదర్‌గా ఉన్న వైవి సుబ్బారెడ్డి ఆశీస్సులు నిండుగా బజాజ్ బుజ్జికి ఉన్నాయి. ఇటీవల మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి బజాజ్ బుజ్జికి మాట ఇచ్చినట్లు ప్రచారం జోరుగా సాగుతుంది.

వైసీపీ ఆరంభం నుండి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న విద్యా వంతుడు వివేక, ఒమేగా విద్యా సంస్థల కరస్పాం డెంట్ కల్లూరి రామిరెడ్డి ఏఎంసి పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. కనిగిరి శాసన సభ్యులు బుర్ర మధుసూదన్ యాద వ్‌కు వ్యతిరేకంగా ఉన్న నియోజకవర్గ వైసీపీ నేతలందరూ కల్లూరి రామిరెడ్డికి పరోక్ష ముగా రామిరెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఊహా గానాలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా అధికారికంగా ప్రకటన వచ్చే వరకు ఏఎంసీ పదవి కోసం ఆశావాహులు తమ ప్రయత్నాలను కొన సాగిస్తూ ఎదురు చూడాల్సిందేనని వైసీపీ కార్యకర్తలు అనుకుంటున్నారు.

సజ్జలను కలిసిన మండల కన్వీనర్ పాలిరెడ్డి కృషారెడ్డి

-సమస్యలు పరిష్కారించాలని వినతి
- సానుకూలంగా స్పందించిన సజ్జల,
- ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ

విశాలాంధ్ర-పెద్దారవీడు : పార్టీ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి తాడేపల్లిలో సోమవారం కలిసారు. మండలంలో నీళ్ల సరఫరా చేసిన వారికి బిల్లులు చెల్లించాలని, ముంపు గ్రామాల ప్రజలకు నష్ట పరిహారం చెల్లించాలని, సచివాలయం పెండింగ్ బిల్లులను అందజేయాలని కోరారు. మండలంలోని మరిన్ని సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన సజ్జల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తొందరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డికి, మంత్రి ఆదిమూలపు సురేష్‌కు కన్వీనర్ కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వంత పార్టీ నాయకులే ఓడించారు...

పదవులు అనుభవిస్తూ పార్టీకి ద్రోహం చేస్తారా
జగనన్నకు ఈవిషయం తెలపాలి
పాకల సర్పంచ్ అభ్యర్థి

విశాలాంధ్ర-శింగరాయకొండ : రాజకీయంగా వారికున్న విబేధాలను ఎన్నికల్లో చూపిస్తారా? స్వంత పార్టీ అభ్యర్థిని ఓడించడానికి డబ్బులు కూడా పంచుతారా ఇదెక్కడి అన్యాయం... జగనన్న రాష్ట్రంలో అన్ని సీట్లు గెలవాలని అందరూ ఐకమత్యంగా పనిచేయాలని చెబుతుంటే కొందరు నాయకులు తమస్వార్థం కోసం విబేధాలు సృష్టించి పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని కొండెపి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపుకు కేవలం వైసిపిలోని ఆపెద్ద మనుషులే కారణమంటూ నియోజకవర్గంలో ఇరు వైద్యులపై ఆయన విరుచుకుపడ్డారు. డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, మాదాసి వెంకయ్యలు పాకల సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు పలుకుతూ డబ్బులు పంచి మరీ ఓట్లు వేయించారని ఆఎన్నికల్లో వైసిపి బలపరిచి, పరాజయం పాలైన ప్రసన్న కుమార్ విమర్శించారు. వైసిపి మద్దతుదారులను ఓటింగ్‌కు రానివ్వలేదని, తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఓట్లు వేయించారని ప్రసన్నకుమార్ ఆరోపించారు. స్థానికంగా జరి గిన ఈ విలేకరుల సమావేశంలో కొండెపి నియోజకవర్గ ఇన్ చార్జి వరికూటి అశోక్‌బాబు కూడా పాల్గొనడం విశేషం. పార్టీలో ఉండే నాయకుల ఓటమిని ముఖ్యనాయకులు కోరు కోవడం విచిత్రంగా ఉందన్నారు. ఇది నిజమో కాదో డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, మాదాసి వెంకయ్యలు సమాధానం చెప్పా లని ఆయన ప్రశ్నించారు. ఒకే కుటుంబంలో మూడు ముఖ్య పదవులు అనుభవిస్తూ నాలాంటి నిరుపేద నేతలపై కక్ష పెంచుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తన ఓటమికి డాక్టర్ అశోక్ కుమార్‌రెడ్డి, మాదాసి వెంకయ్యలే కారణమని ఆయన స్పష్టం చేశారు. తన దగ్గర పూర్తిగా ఆధారాలు న్నాయని ప్రసన్న ప్రకటించారు. పార్టీ కూడు తింటూ పార్టీకి ద్రోహం చేయాలన్న ఆలోచన రావడమేంటని ఆయన ప్రశ్నిం చారు. ఈ విషయాలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని తప్పు చేసిన వారికి దండన తప్పదని అశోక్‌బాబు స్పష్టం చేశారు. పాకల పంచాయతీని కేవలం స్వార్థపరులయిన నాయకుల వల్ల ఓడిపోయామని అశోక్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాయిలా గోవిందరావు సామంతుల రవికుమార్ రెడ్డి పటేల్ సలీం భాష తన్నీరు సుబ్బారావు వైసీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న యాదవ నాయకులు బొట్లా రామారావు

విశాలాంధ్ర-గిద్దలూరు : అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అఖిలభారత మహాసభ రాష్ట్ర శతాబ్ది ఉత్సవాల అధ్యక్షుడు బొట్లా రామారావు తెలిపారు. పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన యాదవుల ఆత్మీయ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత యాదవ కార్పొరేషన్ ఏర్పడి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నుంచి త్వరలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. యాదవులు సంఘటితంగా ఉండి రాజకీయ పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.ఆయన యాదవ గ్రామా అభ్యుదయ సమితిల నిర్మాణ కోసం దిశా నిర్దేశం చేశారు. ప్రతి గ్రామం నుంచి కమిటీ ఏర్పాటు చేసి అనంతరం మండల వారీగా నియోజకవర్గ స్థాయిలో కమిటీ వేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలు చెందిన యాదవ నాయకులు పాల్గొని ఆయా మండలాల్లో ఉన్న సమస్యలను, యాదవుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన సూచనలు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అర్థవీడు మాజీ ఎంపీపీ రవి కుమార్ యాదవ్, రిటైర్డ్ డిఇ పందనబోయిన గోపాలకృష్ణయ్య, డాక్టర్ మురి పిచ్చయ్య, కొత్తకోట పోలయ్య, ఓబు లేసు, ఎంపీటీసీ నారాయణ యాదవ్, కృష్ణమూర్తి, చెన్నుబోయిన మస్తాన్‌రావు, మందగిరి వెంకటేష్, వెంకట్రావు విజయ్, సాయి పాల్గొన్నారు.

నాలుగు టన్నుల ఇసుక స్వాధీనం

జెసిబి ట్రాక్టర్ స్వాధీనం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని మారెళ్ళ గుండ్లకమ్మ వద్ద అక్రమంగా నిలువ ఉంచిన నాలుగు టన్నులు ఇసుకను సోమవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో దర్శి ఎక్సైజ్ సీఐ బి సుందరరామయ్య, ఎక్సైజ్ ఎస్సై ఎం శ్రీధర్ బాబు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇసుకను, జెసిబి ని, ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నామన్నారు .జెసిబి ఆపరేటర్ను, ట్రాక్టర్ డ్రైవర్ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. జెసిబి కి 50 వేలు ట్రాక్టర్ కు10 వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు.

స్మశానం ఏర్పాటు చేయాలని నిరసన

విశాలాంధ్ర-త్రిపురాంతకం : మేడపి అంబేత్కర్ కాలనీ వాసులకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం సీపీఐ నాయకులు బాణాల రామయ్య, అంబేత్కర్ కాలనీ వాసులు ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం డిప్యూటీ తసిల్దార్ భ్రమరాంబకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంబేత్కర్ కాలనీ వాసులు మాట్లాడుతూ గతంలో తమ కాలనీ ఎదురుగా స్మశాన వాటిక వుందని అయితే అది రోడ్ విస్తరణలో పోయిందని అన్నారు. రోడ్ విస్తరణలో పోయిన అప్పటినుండి అనేకమార్లు వినతి పత్రాలు అందించమని ఇప్పటికీ తమకు మోక్షం కలగలేదని అన్నారు.ఎవరైనా చనిపోతే తమ ఇళ్లలో పెట్టుకోవాల్సిన అవసరం వుందని అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు స్మశానం ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్లు,రాజారావు,చిన గాలయ్య, రవికుమార్, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి - వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటలను తప్పనిసరిగా ఈ పంటలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కే ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నారికట్ల గ్రామంలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. మండలంలో సాధారణ విస్తీర్ణం 18, 667 ఎకరాలు కాగా 3040 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు చేయడం జరిగిందన్నారు. కంది పత్తి కూరగాయలు పండ్ల తోటల్లో ఏ పంట నైనా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు

ఎరువులు పంపిణీకి సిద్ధం :- కొనకనమిట్ల మండలానికి 120 టన్నులు ఎరువులు మంజూరయ్యాయని ఆ ఎరువులు పంపిణీ సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ అధికారిని కే ప్రసన్న రంగ లక్ష్మి పేర్కొన్నారు యూరియా 20 20 0 13, 14 35 14, 28 28 0 రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు కావలసిన రైతులు తమ పంటలను ఈ క్రాప్ లో నమోదు చేసి రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులకు వివరాలను తెలియపరచాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు అరవిందు ఆ గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

పొగాకు వేలంను పరిశీలించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌బాబు



విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ శ్రీధర్ బాబు సోమవారం పరిశీలించారు.వివిధ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పొగాకు బోర్డు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మరియు తుఫాను సమయంలో పెంపకందారులకు వడ్డీ రహిత రుణాలను అందించడం ద్వారా సహాయం చేసిందని సాధారణ సేవా ఛార్జీలతో అదనపు పొగాకును విక్రయించడానికి అనుమ తిని తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేశామని తెలియజేశారు. పొగాకు ఉత్పత్తి నిబంధనలు పాటించాలని, అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేయకూడదని, పొగాకు బోర్డు ఇచ్చే కోటాను అంటిపెట్టుకుని ఉండాలన్నారు. డి వేణు గోపాల్, ఎం లక్ష్మణరావు, పొగాకు బోర్డ్ సభ్యులు పి వరప్రసాదరావు, బి.బ్రహ్మయ్య, పొగాకుబోర్డ్ సిబ్బంది, రైతు అసోసియేషన్ నాయకులు - పోతుల నరసింహరావు మరియు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

గోవాలో జరిగే 37 నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించిన కానిస్టేబుల్

విశాలాంధ్ర-ఒంగోలు : ఆగష్టు 12 నుండి15 వరకు మహారాష్ట్ర, నాసిక్‌లోని మినాటై ఠాక్రే ఇండోర్ స్టేడియంలో జరిగిన ట్రయల్ పోటీల్లో పోలీస్ శాఖ నుండి పాల్గొని టాప్-5లో నిలిచి అక్టోబర్ 25 నుండి నవంబర్ 9 వరకు గోవాలో జరగబోయే 37వ నేషనల్ గేమ్స్ కు అర్హత సాధించిన డి.ఎస్.బి రత్నబాబు, గోపిని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒకవైపు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే మరోవైపు క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో నిరంతర సాధన చేస్తూ జాతీయస్థాయిలో పతకాలు సాధించడం, ప్రతిష్టాత్మక నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించడం చాలా గొప్ప విషయమని ప్రశంసంచారు. త్వరలో గోవాలో జరగబోవు నేషనల్ గేమ్స్ పోటీలో ఉత్తమ ప్రదర్శన చేసి పతకాలు సాధించాలని, రాష్ట్ర పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు.

పీసీపల్లి ఎస్సైగా కె మాధవరావు

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీ పల్లి మండల ఎస్సైగా కే మాధవరావును నియమిస్తూ జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పీసీపల్లి ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఏ నాగేశ్వరరావు విఆర్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో బేస్తవారిపేట ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కే మాధవరావు పీసీపల్లి ఎస్సైగా బదిలీ అయ్యారు.

అశోక్ ఈవెంట్స్‌లో పాల్గొన్న గిద్దలూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని క్లబ్ రోడ్‌లో పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పందీటి రజినీబాబు కుమారుడు రూఫస్ నూతనంగా ఏర్పాటు చేసిన అశోక్ ఈవెంట్స్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఈవెంట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ స్టేషన్ పథకం పురోగతిపై సమావేశంలో పాల్గొన్న మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు : అమృత భారత స్టేషన్ పథకం పురోగతిపై పార్లమెంటరీ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ సంజయ్ జైస్వాల్ కమిటీ సభ్యులు ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులురెడ్డి సోమవారం చెన్నైలోని హోటల్ ట్రైడెంట్ సమావేశ మందిరంలో రైల్వే మంత్రిత్వ శాఖ, సదరన్ రైల్వే అధికారులు, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు. రైల్వే మంత్రిత్వ శాఖకు సిఫార్సు చెస్తామని అధికారులకు మాగుంట శ్రీనివాసులురెడ్డి మరియు మిగతా కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని పామూరుపల్లె ఎస్సీ పాలెంలో నాణ్యమైన విద్యుత్ తీగలు లేకపోవటంతో చిన్నపాటి గాలి వానలకే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అంతే కాకుండా తీగలు తెగిపోతున్నాయని పామూరు పల్లె ఎస్సీ పాలెం ప్రజలు సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 30 సంవత్సరాల క్రితం విద్యుత్ సరఫరా కొరకు వేసిన తీగల ఇప్పటికీ ఉన్నాయని, విద్యుత్ శాఖ సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న తమ మొర ఆలకించటం లేదని ప్రజలు తెలుపుతున్నారు. తాము ఎస్సీలమని కాబట్టే మా గ్రామాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక నిండు ప్రాణాన్ని బలుకొన్నాక సంబంధిత అధికారులు స్పందిస్తారేమో చూడాలి మరి.

రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌కు గృహప్రవేశ ఆహ్వాన పత్రిక

విశాలాంధ్ర-కొమరోలు : గిద్దలూరు వైస్సాసీపీ నాయకులు, మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కామూరి రమణారెడ్డి ఈ నెల 27వ తేదీన కొమరోలు నూతన గృహ ప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డికి గృహప్రవేశానికి సతి సమేతంగా హాజరుకావాలని ఆయనకు ఆహ్వాన పత్రిక అందజేశారు. సానుకూలంగా స్పందించిన రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి సతీ సమేతంగా నూతన గృహప్రవేశానికి హాజరవుతారని కామూరి రమణారెడ్డికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ జయప్రకాష్ సాయి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ డాక్టర్ జయప్రకాశ్ సాయి జన్మదిన వేడుకలు హైదరాబాదులోని జూబ్లీహిల్స్, ఓరిస్ బంజారా హోటల్లో ఘనం గా నిర్వహించారు. డాక్టర్ జయప్రకాశ్ సాయి జన్మదిన వేడుకలలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్ రెడ్డి, శివ ప్రకాష్ బన్సాల్, సతీష్ (అడ్వకేట్) మిత్రులు, శ్రేయోభిలాషులు, అధిక సంఖ్యలో హాజరై డాక్టర్ జయప్రకాశ్ సాయికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ చెన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో బూచేపల్లి తన్విక పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నందిని దంపతుల కుమార్తె బూచేపల్లి తన్విక జన్మదిన వేడుకల సందర్భంగా ముండ్ల మూరు మండలంలోని జమ్ములమడక గ్రామంలో శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో బూచేపల్లి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కుటుంబంతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూచేపల్లి అభిమానులు పాల్గొని బూచేపల్లి తన్వికకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపా రమణారెడ్డి, సుగుణ, కాపా నరసింహారెడ్డి, కాపా రాజశేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగం నుంచి ఉద్యోగ కల్పనే ఐవైయం జాబ్ బాక్స్ లక్ష్యం

విశాలాంధ్ర-మార్కాపురం : ఐడియల్ యూత్ మూవెమెంట్ (ఐవైయం) మార్కాపురం శాఖ ఆధ్వర్యంలో ఐవైయం జాబ్ బాక్స్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. సోమవారం స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జమాఅతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షులు సికిందర్ మాట్లాడుతూ స్థానిక యువకుల్లో నిరుద్యోగ సమస్యను తొలగిం చడమే లక్ష్యంగా ఐవైయం జాబ్ బాక్స్ పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐవైయం రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ మాట్లాడుతూ యువతలో గల నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, వృత్తిపరమైన స్కిల్స్ శిక్షణకు సంబంధించిన సమాచారం ఇచ్చి సరైన మార్గం చూపడమూ జాబ్ బాక్స్ పని అని అన్నారు. కార్యక్రమంలో ఐడియల్ యూత్ పట్టణ అధ్యక్షులు అబూ బకర్, ఐవైయం సంస్థ జిల్లా అధ్యక్షులు తలహా, ఐవైయం పట్టణ కార్యదర్శి రసూల్ సంస్థ సభ్యులు ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

యోగయ్య స్వామి మఠం పునరుద్ధరణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక వినకొండ రోడ్డులో 110 సంవత్సరాలు చరిత్ర కలిగిన శ్రీ యోగి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మఠం జీర్ణోదారణ పనులు సోమ వారం శాస్త్రీయంగా నిర్వహిం చారు పూర్వకాలము నుండి గ్రామ రక్షకునిగా శ్రీ యోగి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తాత ఈ గ్రామ ప్రజలకు సుపరిచితుడు సిద్ధియోగిగా పేరుపొందిన స్వామి మరణాంతరము వినకొండ రోడ్డులో ఉన్న మటములో సమాధి చేశారు. గ్రామస్తులు సహకా రంతో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు గుంటూరుకు చెందిన సిద్ధాంతి వేదాంత పండితులు సాగి నరసింహా మూర్తి శిష్య బృందం వారిచే సోమవారం వేదమంత్రోచరణతో పూజా కార్యక్రమం నిర్మించారు ఈ కార్య క్రమంలో వేద పండితులతో పాటు స్థానిక వీఆర్వో వెంకట నాగరాజు గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు నిర్వహించారు.